మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## విద్యుత్‌షాక్‌తో ఆపరేటర్ మృతి

**కంగ్టి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

విద్యుత్‌షాక్‌తో విద్యుత్ ఆపరేటర్ మృతిచెందినఘటన కంగ్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని తడ్కల్‌గ్రామానికిచెందిన ఎల్లుట్ల అశోక్‌గౌడ్ (36) గత ఐదు సంవత్సరాల నుంచి ఎలక్ట్రికల్ ఆపరేటర్‌గా తడ్కల్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. అయితే వృత్తిలోభాగంగా ఈ నెల 2వ తేదిన ముర్కుంజాల్ గ్రామంలో కరెంటులేదని ప్రభాకర్‌గౌడ్ మృతుడు అశోక్‌గౌడ్‌కు ఫోన్‌చేసి చెప్పగా వెంటనే మృతుడు దసరాపండుగ సందర్భంగా అత్యవసరం ఉంటుందని ముర్కుంజాల్‌వైపు వున్న సప్లైకి బదులు తడ్కల్‌వైపు వున్న సప్లయ్‌ని పొరపాటున ఆపి, ముర్కుంజాల్ గ్రామశివారులో సాయిగౌండచేనులో వున్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్ళి కరెంటు సప్లయ్ ఆగిందనుకొని పొరపాటుపడి రిపేర్ చెయ్యడానికి వెళ్లగా దురదృష్టవశాత్తూ కుడిచేతికి షాక్‌తగిలి అక్కడికక్కడనే చనిపోయాడు. మృతుడు భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులోపడి యువకుడు మృతి

**-పండగపూట ఫైజాబాద్‌లో విషాదం**

**చిలిపిచేడ్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

పండగపూట ఫైజాబాద్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తూ చెరువు(కుంట)లో పడి యువకుడు మృతిచెందిన సంఘటన చిలిపిచేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం రేపింది. గురువారం చిలిపిచేడ్ మండలంలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన చాకలి బాలేష్(30) ఉపాధి కోసం కుత్బుల్లాపూర్ మండలంలోని బోరంపేటలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పండగ కోసం అని గత మూడురోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గ్రామంలోని దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనానికి అమ్మవారి ముందర ఉన్న చెరువు(కుంట)లో వేయడానికి వెళ్ళిన బాలేష్ ప్రమాదవశాత్తూ కాలుజారి కుంటలోపడి మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దసరా పండగ రోజు యువకుడు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకోసం ప్రతి ఒక్కరం సైనికుల్లా పనిచేద్దాం

**-ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి**



ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామిని సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరం సైనికుల్లా పనిచేద్దామని రాష్ట్ర కార్మికశాఖ, ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లతో కలిసి శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేదల సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలుచేస్తున్న పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాల్లో పార్టీజెండా ఎగరవేసేలా కృషిచేయాలన్నారు. 10యేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కవర్గానికీ న్యాయం జరగలేదని తెలంగాణ సంపదను దోచుకొని దాచుకున్నారని ఆరోపించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌నాయకుల మాయమాటలునమ్మి మోసపోవద్దన్నారు. జిల్లాప్రజలకు, పార్టీశ్రేణులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామిని పూజల హరికృష్ణ, ఎం.డి.ఇమామ్(అత్తు)లు శాలువాలతో ఘనంగా సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి, పయ్యావుల ఎల్లం, రియాజుద్దీన్, కలీం, దేవులపల్లి యాదగిరి, తప్పెట శంకర్, బర్మా రాంచంద్రం, కోమిలి బిక్షపతి, రాములు, మీసం మహేందర్‌యాదవ్, కవిత, రజిని, వహాబ్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఆవాసకేంద్రం ఏర్పాటుకు కృషి

**-అంత్యక్రియలు చేసుకోవడానికి వీలుగా రెండుగదుల నిర్మాణం**

**-సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సి.సంతోష్

**గజ్వేల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సొంత ఇల్లు, స్థలం లేని వారు దురదృష్టవశాత్తూ ఎవరైనా చనిపోతే హిందూ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియల కార్యక్రమం జరుపుకోవడానికి ఇబ్బందిగా మారిన తరుణంలో ఆర్యవైశ్య సంఘం సహకారంతో రెండుగదుల ఇల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అద్దెకు ఉంటున్న నిరుపేదలు ఎవరైనా మరణించినా, వారి అంత్యక్రియలకు ఇంటి యజమానులు సహకరించకపోవడం తరచూ చూస్తున్నామని, వారికోసం ఆవాసగృహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఆర్యవైశ్యసంఘం సహకారంతో చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే స్థలం సేకరించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, అత్తెల్లి నాగేంద్రం, కొమురవెల్లి ప్రవీణ్, కొండపోచమ్మదేవాలయ మాజీడైరెక్టర్ అయిత సత్యనారాయణ, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్తునూరి సంపత్, బ్రాహ్మణపల్లి బిక్షపతి, నరేందర్‌రెడ్డి, దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెండికోల్‌లో ఇరువర్గాల ఘర్షణ

**పుల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

పుల్‌కల్ పోలీసుఠాణా పరిధిలోని వెండికోల్‌లో దసరా వేడుకల్లో భాగంగా గురువారంరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన స్నేహితులైన చాకలి రవి, చాకలి శివకుమార్‌ల మధ్య మాటామాటా పెరిగి గొడవలకు దారితీసింది. ఇరువురు గొడవపడుతున్న విషయాన్ని రవి తల్లి పెంటమ్మ గ్రామ మాజీసర్పంచ్ గిరంగారి పల్లవిజయరాంరెడ్డికి చెప్పగా ఇరువు రిని సముదాయించేందుకు యత్నించారు. జయరాంరెడ్డి మాటలకు రవి గొడవ నుంచి తప్పించుకోగా జయరాంరెడ్డి, అతన అనుచరులు, శివకుమార్‌ల మధ్య గొడవ మొదలయింది. ఘర్షణతో శివకుమార్ కంటిభాగంపై తీవ్రంగా గాయా లయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విశ్వజన్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి గొడవలను అదుపులోకి తెచ్చారు. తనను కులంపేరుతో దూషించి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శివకుమార్ ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు.

## ప్రమాదవశాత్తూ నీట మునిగి ఒకరు మృతి

**పాపన్నపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

ప్రమాదవశాత్తూ నీటమునిగి ఒకరు మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని అమ్రియా తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం...గిరిజన తండాకు చెందిన లునావత్ చందర్(36) వ్యవసాయంతో పాటు కూలీపనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. గురువారం ఉదయం చేపలు పట్టేందుకు పాతలింగాయిపల్లి శివారులో ఉన్న పెద్ద చెరువు వద్దకు వెళ్లి చేపల కోసం వలవేసి ఇంటికి వచ్చాడు. మళ్లీ సాయంత్రం చెరువు వద్దకు వెళ్లి వలలో చేపలుపట్టే క్రమంలో ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. చెరువులో గాలించగా ఆచూకీ లభించలేదు. అప్పటికే రాత్రి కావడంతో శుక్రవారం గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య బుజ్జీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## సింగూరుకు తగ్గిన వరద ప్రవాహం

**-ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 16833 క్యూసెక్కులు**

**-9 క్రస్ట్ గేట్ల మూసివేత**

**పుల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

సింగూరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వరదప్రవాహం తగ్గుముఖం పట్టింది. గత నాలుగైదు రోజుల పాటు లక్ష 16వేల క్యూసెక్కులకు పైగా వరద జలాలు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. ప్రాజెక్టు నుంచి 11గేట్లు ఎత్తి దిగువకు వరదనీటిని వదిలేశారు. గురువారం సాయంత్రం నుంచి ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతుండటంతో వరద ప్రవాహంలో మార్పులు చోటు చేసుకోవడంతో అధికారులు గురువారం రాత్రి 10.30 గంటలకు 3 క్రస్ట్ గేట్లను మూసేసి 8 క్రస్ట్ గేట్లను 2 మీటర్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేశారు. అయితే ప్రాజెక్టులోకి వరద మరింతగా తగ్గిపోవడంతో 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని వదులుతుండగా ప్రాజెక్టులోకి వరద ప్రవాహం మరింతగా తగ్గడంతో తెరిచిన 6 గేట్లను మూసేశారు. 11, 12 క్రస్ట్ గేట్ల ద్వారా 14,308 క్యూసెక్కులు జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1985 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూహెచ్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్ ఫ్లో 16,833 క్యూసెక్కులుగా నమోదయింది. శుక్రవారంరాత్రి వరకు ప్రాజెక్టులో 520,866 మీటర్లకు 17.866 టిఎంసిల నీటినిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

## ఘనంగా జాతిపిత గాంధీజీ జయంతి

**-నివాళులర్పించిన అడిషనల్ డిసిపి అడ్మిన్ కుశాల్కర్**



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో జాతిపిత మహాత్మాగాంధీ 156వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అయన దేశ స్వాతంత్రం కోసం చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు.

**జిల్లా కలెక్టరేట్‌లో...**

జిల్లా కలెక్టరేట్‌లో బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, బిసి సంక్షేమశాఖ అధికారి సయ్యద్ రఫీ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

**సిపి కార్యాలయంలో...**

జాతిపతి మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సిపి కార్యాలయంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.హెచ్.కుశాల్కర్ ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగినప్పుడే దేశం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. దేశ పౌరులు గాంధేయమార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు సాయిప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు...**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో గల గాంధీ విగ్రహానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పూలమాలలువేసి ఘనంగా నివాళుర్పించారు. అనంతరం మహాత్ముని స్మరించుకున్నారు.

## అహింసాసిద్ధాంతానికి మార్గదర్శకులు గాంధీజీ

**-ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్**



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్

**నారాయణఖేడ్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో గురవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ స్వగృహంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపివెంట ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళికా సంఘంసభ్యులు నాగేష్ శెట్కార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ అహింసాసిద్ధాంతానికి మార్గదర్శకులు. ఆయన ఆలోచనలు, త్యాగం ప్రతి భారతీయునికి స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పి కోఆప్షన్ సభ్యులు రషీద్, నారాయణ ఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, బిసి సెల్ అధ్యక్షులు సాయిలుపటేల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, రహీమ్, సుల్తాన్, అశ్వక్, ఓంకార్, బారీ, పండరి, శాతం దత్తు, ఎక్కనాథ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత న్యాయస్థానం ఏ తీర్పు ఇచ్చినా... ఎన్నికలు తప్పకుండా నిర్వహించాలి

**-స్థానిక ఎన్నికలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**

**-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



బిఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

బిసి రిజర్వేషన్ల కోసం అఖిలపక్షం ఏర్పాటుచేసి కేంద్రంలో మోడీని, రాష్ట్రపతిని కలిసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు అమలుచేశారని, గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొందని, ఈనెల 8న ఉన్నత న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇచ్చినా ఎన్నికలను ఆపవద్దని ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలతో 22 నెలల నుండి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో దివాలా తీయించారన్నారు. తన 22 నెలల పాలనలో రాష్ట్రం 22 సంవత్సరాలు వెనుకబడిందని, రైతులకు యూరియా సకాలంలో అందించలేదని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారం చేజిక్కించుకున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్ రాకుండా చేస్తామని హెచ్చరించారు.

**బిఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు...**

గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్, కొండపాక మండలాలకు చెందిన వివిధపార్టీల నాయకులు మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన తూప్రాన్ మాజీ కౌన్సిలర్లు రఘుపతి, బాల్‌రెడ్డి, కొండపాకకు చెందిన నాగరాజు, దుద్దెడకు చెందిన స్వామిలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే ఏకైక పార్టీ బిఆర్‌ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎవరూ నమ్మడంలేదని, పార్టీపై ఉన్న అసంతృప్తితోనే బిఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బిఆర్‌ఎస్ పార్టీలోకి అల్లరిమూకలను, భూకబ్జాదారులను తీసుకోమని ఖరాఖండిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మాజీ కౌన్సిలర్లు తలకొక్కుల దుర్గాప్రసాద్, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, రవి, ఊడెం కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యువజన అధ్యక్షుడు స్వామిచారి, అత్తెల్లి శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే

**-అంగరంగవైభవంగా దుర్గమ్మ శోభాయాత్ర వేడుకలు**



అమ్మవారి శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలో కొడపాక, సీతానగర్ గ్రామాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దుర్గామాత నిమజ్జనం శోభాయాత్రలో మెదక్ బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మండల నాయకులతో కలసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళతో కలసి కోలాటం ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుర్గామాత శోభయాత్రలో పాల్గొన్నడం సంతోషంగా ఉంది అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలాగౌడ్, మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచ్‌లు సంగప్ప, సంజీవరెడ్డి, బద్రి మల్లేశం, వెంకట్, రాములు, నాయకులు కాశినాథ్‌రావు, బెజగం శంకర్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, భూషణం, చారి, భాషప్ప, కృష్ణ, సాయివర్ధన్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ట్రావెల్ బస్సులో మత్తు పదార్థాలు సీజ్



ట్రావెల్‌బస్సులో తరలిస్తున్న మత్తుపదార్థాలను పట్టుకున్న పోలీసులు

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చిరాగ్‌పల్లి ఆబ్కారి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో అక్రమంగా ట్రావెల్ బస్సులో (ఎన్ఎల్ 02 బి 3185) తరలిస్తున్న 7లక్షల 31వేల250 రూపాయల విలువగల మత్తుపదార్థాల (నూట్రోజోఫామ్)ను ఆబ్కారి పోలీసులు గురువారం పట్టుకున్నారు. మత్తుపదార్థాలను కర్ణాటకలోని గుల్బర్గా నుంచి హైద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రావెల్ డ్రైవర్‌ను అరెస్టుచేసి మత్తుపదార్థాలు ట్రావెల్ బస్సులో తరలిస్తున్న వ్యక్తి గురించి గాలింపుచర్యలు ప్రారంభించామని జహీరాబాద్ ఆబ్కారి సిఐ టి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టుచేసిన డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

**-ముగ్గురికి తీవ్ర గాయాలు**

**గజ్వేల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో ఆరేళ్ల బాలిక మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి రింగ్‌రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగుపల్లి గ్రామానికి చెందిన బాసాడి నరేష్‌రెడ్డి, అతని భార్య వైష్ణవి, కుమారుడు సాకేత్‌రెడ్డి, కూతురు రిష్విత్‌రెడ్డి(6)లు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై చేగుంట మండలం కర్ణంపల్లి ఎల్లమ్మ దేవాలయానికి వెళ్ళి దర్శనంచేసుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సంగుపల్లి గ్రామ సమీపంలోకి రాగానే రింగ్‌రోడ్డు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈసంఘటనలో నరేష్‌రెడ్డి కూతురు రిష్విత్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందగా, నరేష్‌రెడ్డి, వైష్ణవి, సాకేత్ రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ పైలెట్ కరుణాకర్, ఈఎంటి విజయ్‌లు సంఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిచెందిన బాలిక రిష్విత్‌రెడ్డిని గజ్వేల్ మార్చురీకి తరలించారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**కంగ్టి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన కంగ్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని సుక్కల తీర్థ గ్రామానికిచెందిన సరేకూరె సురేశ్(32) రాజరాంతండాకువెళ్లే బీటీ రోడ్డుకు ఆనుకొని అనుమానాస్పదంగా మృతిచెందారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతుడిని గుర్తించి కుటుంబీకులకు తెలిపారు. మృతుడి అక్క ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తుచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## చేపలవేటకు వెళ్లిన వ్యక్తి మృతి

**అల్లాదుర్గం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

చేపలవేటకు వెళ్లిన మత్యకారుడు యాదగిరి(41) ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిల్వర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ కథనం ప్రకారం, ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాడబోయిన యాదగిరి గురువారం దసరా పర్వదినాన సోదరుడి కుమారులతో కలిసి మందాపూర్ గ్రామ శివారులోని చెన్నయ్యకుంటలో చేపలవేటకు వెళ్లారు. యాదగిరి నీటిలోదిగి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగిపోవడంతో విషయాన్ని గమనించి సోదరుడి కుమారులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ వివరించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు. దసరాపండగ పూల యాదగిరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎస్సీ,ఎస్టీ కేసు నమోదుపై విచారణ



విచారణ చేపడుతున్న గజ్వేల్ ఎసిపి నరసింహులు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం గ్రామానికిచెందిన మహిపాల్ అనేవ్యక్తి గొర్రెలు మేపుతుండగా పాత భూవివాదాలు మనసులోపెట్టుకున్న జగదేవ్‌పూర్‌కుచెందిన బచ్చలి ఎల్లయ్య, మహేష్, మల్లయ్యలు కర్రతో మహిపాల్‌పై దాడిచేసి కులంపేరుతో దూషించారని బాధితుడు ఫిర్యాదుచేయగా నిందితులపై ఎస్సీ,ఎస్టీ నిరోధకచట్టం కేసును జగదేవ్‌పూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి నమోదుచేయగా శుక్రవారం గజ్వేల్ ఎసిపి నరసింహులు గ్రామానికిచేరుకొని కేసుపై విచారణచేపట్టారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి, పోలీస్‌సిబ్బంది, దళితసంఘాల నాయకులు గడ్డం వెంకటేష్, గ్రామనాయకులు అజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గాంధీవిగ్రహాన్ని ధ్వంసంచేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**-నూతన గాంధీవిగ్రహాన్ని ఏర్పాటుచేసిన గ్రామస్థులు**



విగ్రహాన్ని ధ్వంసంచేసిన నేపథ్యంలో పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్థులు

**వెల్దుర్తి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

మండలంలోని యశ్వంతరావు పేటలో గాంధీ జయంతి రోజైన గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం పోలీసులకు తెలపడంతో గ్రామాలోని కొంతమంది యువకులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా శుక్రవారం గ్రామంలో నూతన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దసరా సంబురాలు

**నంగునూరు/సిద్దిపేటరూరల్/సిద్దిపేట అర్బన్/మిర్‌దొడ్డి/కొమురవెల్లి/అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దసరా పండగ సంబురాలు అంబరాన్ని అంటాయి. ఊరూరా దసరావేడుకలతో కళకళలాడాయి. సంప్రదాయ బద్ధంగా చిన్నాపెద్దా తేడాలేకుండా దసరా ఉత్సవాల్లో ఆనందంగా పాల్గొన్నారు. నూతన వస్త్రాలను ధరించిన ప్రజలు డప్పువాయిద్యాలతో దసరావేడుకలకు తరలి వెళ్లారు. పాలపిట్ట దర్శనం, శమీపూజతోపాటు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరు, పాలమాకుల, రాజగోపాల్‌పేట, గట్లమల్యాల, నర్మెట్ట, అక్కెనపల్లి, బద్దిపడగల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ చావడీల వద్ద వేడుకలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. పురాతన రాజగోపాల్‌పేట కోటగడి వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**సిద్దిపేట రూరల్, అర్బన్ మండలాలలో..**
చెడుపై మంచి సాధించే విజయంగా చెప్పుకొనే దసరా పండుగను సిద్దిపేట రూరల్, అర్బన్ మండలాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో దసరా పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. చెరువుగట్టుల చెంతకువెళ్లి పాలపిట్టను దర్శించుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించగా, జమ్మి ఆకుకోసం పోటీపడ్డారు. జమ్మి ఆకుతో కుటుంబీకుల ఆశీర్వాదం అందుకొని, స్నేహితులతో పండుగ శుభాకాంక్షాలు తెలుపుకున్నారు.

**మిర్‌దొడ్డిలో..**
దసరా సంబరాలు మిర్‌దొడ్డి మండలంలో ఘనంగా జరిగాయి. మిర్‌దొడ్డి కొత్తబస్టాండు ప్రాంగణంలో రావణాసురుని ప్రతిమ ఏర్పాటుచేసి దహనంచేశారు. సీతారామ సమేత విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి వీధివీధిన పూజలు నిర్వహించారు. పాలపిట్టను వీక్షించారు. ఆలయాలు కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల్లో మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో..**
కొమురవెల్లి మండలంలోని అయా గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దల ఆశీస్సులు పొందారు. ఆయా గ్రామాల్లో పొలిమేరలకు వెళ్లి పాలపిట్టను సందర్శించుకొన్నారు. శమీపత్రాలు ఇచ్చుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.


కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో శమీపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**మల్లన్న ఆలయంలో ఘనంగా శమీపూజ..**
మండల కేంద్రంలోని మల్లన్న ఆలయంలో విజయ దశమి సందర్భంగా గురువారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో శమీపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఈఓ బుద్ది శ్రీనివాస్, అర్చకులు స్థానాచారి మల్లయ్యస్వామి, మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తల మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, అలయ అధికారులు, అర్చకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## దేవీత్రిరాత్రి ఉత్సవాల సమాప్తి
-ఘనంగా పూజ కార్యక్రమాలు


అమ్మవారికి త్రిశూలస్నానం చేయిస్తున్న అర్చకులు

**కొమురవెల్లి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి దేవాలయంలో నిర్వహించిన దేవి త్రిరాత్రి ఉత్సవాల సమాప్తిలో గురువారం గణపతి పూజ, మంటపదేవత ఆరాధన, దేవి ఆరాధన తదితరల పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దేవాలయం నుంచి కోనేరుకు తీసుకెళ్లి శ్రీ స్వామివారి కోనేరులో త్రిశూల స్నానం ఆచరించారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్ప సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాద వితరణ చేశారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన నరోత్తం


నరోత్తంకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
నియోజకవర్గ ప్రజలకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పండరినాథ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు శంకర్, సిద్దన్న పాటిల్, ఆర్ రాజు, టి నారాయణ, మచ్చేందర్, నర్సప్ప, మాణయ్యగౌడ్, రాజు, నాగిశెట్టి, మైనోద్దిన్, సత్యనారాయణ, శికారి గోపాల్, జి.నర్సింలు, రాజ్‌కుమార్, శివరాజ్ పాటిల్, నర్సింహారెడ్డి, సంజీవ్, ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పెంటన్న,, విఠల్, గఫార్, చంద్రయ్య, నర్సింలు, వీర్‌శెట్టి, కుప్పన్న పాటిల్, సుధాకర్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, కీరు, దేవిదాస్ జాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగం పొందిన రంజిత్‌రెడ్డికి గ్రామస్థుల ఘనసత్కారం


రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

**కొమురవెల్లి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అక్కెనపల్లి రంజిత్‌రెడ్డి ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగం సాధించడంతో ఆయన గురువారం మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం జాయింట్‌కలెక్టర్‌గా ఉద్యోగం సాధించిన రంజిత్‌రెడ్డిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తాడూరి రవీందర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గుండా చంద్రం, అక్కెనపల్లి వేణుగోపాల్‌రెడ్డి, శెట్టిపల్లి విజేందర్‌రెడ్డి, పాకనాటి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## పిడిచెడ్‌లో ఘనంగా చండీహోమం
**గజ్వేల్ టౌన్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద గ్రామ మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాణిశ్రీ నాగిరెడ్డి, స్వప్న కరుణాకర్, లావణ్య కృష్ణారెడ్డి, రాణి సంజీవరెడ్డి, రాజమణి దామోదర్‌రెడ్డి, ధనమ్మ సోమయ్య, మాధవి మోహన్‌రెడ్డి, భారతమ్మ రాంచందర్‌రాజు, సుజాత రాజవర్ధన్‌రెడ్డి, రేణుక తిరుపతిగౌడ్, చరణ్‌గౌడ్, శివవర్ధన్‌గౌడ్, నాని, జశ్వంత్‌గౌడ్, ముకేష్‌గౌడ్, శ్రీధర్, నవీన్, వినయ్‌రెడ్డి, శ్రావణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న మేకల కనకయ్య
**మర్కుక్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పాములపర్తిలో ఏర్పాటుచేసిన దుర్గామాతను బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీవిగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త

**నర్సాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసంచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేటలో గుర్తు తెలియని వ్యక్తులు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం అన్నారు. గాంధీ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ మేరకు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఇలాంటి చర్యలు మరల ఉత్పన్నమైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీనివాస్‌గుప్త హెచ్చరించారు.

## రసాయన శాస్త్రంలో శశికళకు పిహెచ్‌డి
**పటాన్‌చెరు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతంస్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనశాస్త్రవిభాగం పరిశోధక విద్యార్థిని చీమలపాటి వివి శశికళ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. కెనాగ్లిఫ్లోజిన్, అబిరాటెరోన్ అసిటేట్, వాటిసంబంధిత పదార్థాల సమర్థవంతమైన సంశ్లేషణపై అధ్యయనంచేసి, సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న అసోసియేట్‌ప్రొఫెసర్ డాక్టర్ అన్నాప్రగడ రత్న మాల శుక్రవారం ఈవిషయాన్ని వెల్లడించారు. గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్‌ఆర్‌వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయనశాస్త్రవిభాగాధిపతి డా.గౌసియాబేగం, సిబ్బంది తదితరులు శశికళను అభినందించినట్టు పేర్కొన్నారు.

## మహనీయుల త్యాగం అమోఘం
-శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి


గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య పోరాటంలో మహనీయులు త్యాగం గొప్పదని, వారు భారతదేశం నిర్మాణం కోసం కృషి చేసిన తీరు అందరికీ ఆదర్శమని శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి, మాజీ శాసనసభ్యులు పట్లోళ్ల కిష్టారెడ్డిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాయిసంగమేశ్వర్, జోన్ చైర్మన్ రాజుకుమార్, సభ్యులు ముదసిర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా..
**పెద్దశంకరంపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు ఆసూరి మురళి పంతులు శుక్రవారం అధ్యక్షపదవికి రాజీనామా చేశారు.. బిఆర్ఎస్ మండల అధ్యక్షపదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామాచేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలకు లేఖలను పంపినట్లు వివరించారు. వ్యక్తిగత కారణాలవల్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షపదవికి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామాలేఖను ఆమోదించి పార్టీ బాధ్యతల నుండి తప్పించాలని కోరారు.

## ఘనంగా విజయదశమి వేడుకలు


చాట్లపల్లిలో జమ్మివృక్షానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
జగదేవ్‌పూర్ మండలకేంద్రంతో పాటు చాట్లపల్లి, తీగుల్‌నర్సాపూర్, మునిగడప, ఇటిక్యాల, బస్వాపూర్ తదితరగ్రామాల్లో గురువారం విజయదశమివేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. చాట్లపల్లి గ్రామంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా జమ్మివృక్షం వద్దకు వెళ్లి జమ్మి వృక్షానికి పూజారులు పూజలు నిర్వహించగా ప్రజలు జమ్మిని తీసుకొని ఒకరికొకరు జమ్మిని ఇచ్చిపుచ్చుకొని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా దసరా సంబురాలు
**వెల్దుర్తి, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండలవ్యాప్తంగా గురువారం దసరాపండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. పాలపిట్టనుచూడడానికి చిన్నాపెద్దా అనేతారతమ్యంలేకుండా గ్రామస్థులు పొలాల గట్టులకు తరలివెళ్లారు. అనంతరం జమ్మి ఆకును ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం రావణాసురుని దహన కార్యక్రమం జరుపుకున్నారు.

## ఏడుపాయల్లో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు
-పల్లకీ మోసిన మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి
-కొనసాగుతున్న మంజీర వరద


పల్లకీపై ఊరేగుతున్న దుర్గమ్మ

**పాపన్నపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
ఏడుపాయల్లో గురువారం దేవీశరన్నవరాత్రతి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. చివరిరోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఉదయం ఏడుపాయల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల మధ్య వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని, పల్లకీపై ఉంచి సుహాసినిరెడ్డి, మదన్‌రెడ్డిలతో పాటు భక్తులు పల్లకీ మోస్తూ ఊరేగించారు. అనంతరం గంగమ్మకు పూజలు చేసి, మంజీరానదిలో నిమజ్జనంచేశారు.

**పోటెత్తిన భక్తులు...**
శరన్నవరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఏడుపాయలకు తీసుకొచ్చి, శుక్రవారం మంజీరానదిలో నిమజ్జనం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఏడుపాయల జనసంద్రంగా మారింది. రెండవబ్రిడ్జిపై ట్రాఫిక్‌జాం అయ్యింది. దీంతో వాహనాలకు అంతరాయం ఏర్పడింది. పలువురుభక్తులు సెల్ఫీలుదిగుతూ సందడిచేశారు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ దగ్గరుండి ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు. భక్తులు రాజగోపురంలోని దుర్గమ్మను దర్శించుకొని పూజలుచేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**వరద తగ్గని మంజీర...**
మంజీర వరదలు శుక్రవారం కూడా. భారీగా కొనసాగుతున్నాయి. సింగూరు నుంచి ఉదయం 88,827 క్యూసెక్కుల నీటిని వదలగా, సాయంత్రానికి 15,749 క్యూసెక్కులకు తగ్గించారు. అయినప్పటికీ సాయంత్రం దుర్గమ్మ ఆలయం ముందు నుండి మంజీర వరదలు భారీగా ప్రవహిస్తున్నాయి.

## నర్సాపూర్‌లో ఘనంగా గాంధీ జయంతి


గాంధీవిగ్రహానికి ఘననివాళులు అర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

**నర్సాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం నర్సాపూర్ పట్టణంలో నర్సాపూర్ గౌడసంఘం ఆధ్వర్యంలో గాంధీజయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తోపాటు గౌడసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పాపగారి చిన్నరమేష్‌గౌడ్, డి.ఆంజనేయులుగౌడ్, బిక్షపతిగౌడ్, అనిల్‌గౌడ్, రామస్వామిగౌడ్, గౌడసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గామాత శోభాయాత్ర


ఘనంగా దుర్గామాత శోభాయాత్ర దృశ్యం

**అల్లాదుర్గం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన అల్లాదుర్గంలో దసరాను పురస్కరించుకుని సిలాం కోటదొడ్డి సమీపంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో నిత్యం భక్తులతో పూజలందుకున్న దుర్గామాతను శుక్రవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సాయంత్రం అందంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించుకుని గ్రామంలోని పురవీధుల గుండా ఆటపాటలతో ఆనందోత్సాహాలతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి గ్రామశివారులోని చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

## పుట్టిన ఊరుకు సేవచేయడం సంతృప్తి
-రూ.15లక్షలతో నిర్మించిన మందపల్లి కమాన్ ప్రారంభం


మందపల్లి కమాన్ ప్రారంభిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
పుట్టిన ఊరికి సేవచేయడంలో ఎంతోసంతృప్తి ఉంటుందని, గ్రామానికి భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాలు అందించడానికి ఎప్పుడూ ముందుంటామని ప్రముఖ వ్యాపారవేత్త అయిలేని వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మందపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన ముఖ ద్వారం వద్ద రూ.15లక్షలతో నిర్మించిన కమాన్‌ను ఆయన గ్రామస్థులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఎపి ఎక్స్‌ప్లోజెవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో చైర్మన్‌గా కొనసాగుతూ గ్రామానికి సేవచేయడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేటలో ఆర్ఎస్ఎస్ సభ
**హత్నూర, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందసంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హత్నూరమండలం నవాబుపేటగ్రామంలో శుక్రవారం ఆవిర్భావదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు

## మండల కాంగ్రెస్ అడక్ కమిటీ నియామకం
**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల కాంగ్రెస్‌పార్టీ అడక్ కమిటీ కార్యవర్గాన్ని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ శుక్రవారం నియమించారు. మండల అడక్ కమిటీ అధ్యక్షులుగా మాజీ సర్పంచ్ ఎంజి రాములుయాదవ్, కమిటీ సభ్యులుగా వెంకటరెడ్డి(హోతి(బి), నాగిశెట్టిరాథోడ్ (అర్జున్‌నాయక్‌తండా), వెంకట్‌రెడ్డి(బూచినెల్లి), చన్మద్దీన్ (షేకాపూర్), జనార్దన్(శేఖపూర్), వంశి (హోతి(బి), బి.రవీందర్‌చౌహాన్ (శేఖాపూర్‌తండా), సోన్నాయి సురేష్ (డిడిగి)లను నియమించారు.

**మండల అధ్యక్షుడి సస్పెండ్-మాజీమంత్రి...**
జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండటంతో పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మల జయప్రకాశ్‌రెడ్డిని కోరగా వెంటనే స్పందించిన జిల్లా అధ్యక్షురాలు నర్సింహారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చంద్రశేఖర్ వివరించారు.

## లింగాపూర్ గ్రామంలో రావణదహనం
**నర్సాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్‌గ్రామంలో గ్రామానికిచెందిన రాజు ఆధ్వర్యంలో యువకులంతా దసరాసందర్భంగా మొట్టమొదటిసారిగా రావణదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామప్రజలందరూ పాల్గొని విజయవంతంచేశారు. ఈమేరకు గ్రామస్థులంతా దసరాపండగను ఘనంగా జరుపుకున్నారు. ఈసంవత్సరం నుండి ప్రతి దసరాపండుగకు రావణదహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు రాజు తెలిపారు.

## మైక్‌సెట్ అందజేత
**చిన్నకోడూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
ప్రతియేటా నిర్వహించే దుర్గామాత మండపాలవద్ద మైక్‌సెట్ ఎంతో ఉపయోగపడుతుందని కుంభాల చంద్రశేఖర్ అన్నారు. మండలపరిధిలోని అల్లీపూర్ గ్రామంలోని 9,10వ వార్డులలో మహిళలకు మైక్‌సెట్‌ను అందించారు. కార్యక్రమంలో ఆయావార్డుల మహిళలు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ
**రామచంద్రాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దసరాపండగను పురస్కరించుకుని పటాన్‌చెరులో ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికి, జిహెచ్ఎంసి కార్మికులకు, ఇతరకూలీలకు పటాన్‌చెరు బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధులు దుప్పట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, ఆకాశం అనాథాశ్రమం ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో ధర్మశాల వద్ద రావణదహనం
-జమ్మి చెట్టుకు పూజలు..పాలపిట్ట దర్శనం..


ధర్మశాల వద్ద హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణదహన కార్యక్రమ దృశ్యం

**నర్సాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో గురువారం దసరా(విజయదశమి) వేడుకలను పట్టణ ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం నర్సాపూర్ మార్కెట్ రోడ్‌లోగల హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి జాతీయ జెండాను ఎగరవేశారు. అక్కడి నుండి పార్టీలకతీతంగా పుర ప్రముఖులంతా ఊరేగింపుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ప్రజలంతా పాలపిట్టను దర్శించుకున్నారు. అటు తర్వాత అందరూ ఆలింగనం చేసుకుంటూ ఒకరినొకరు దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇది ఇలా ఉండగా సాయంత్రం ధర్మశాల వద్ద ఏడు గంటలకు హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ రావణ దహన కార్యక్రమానికి పార్టీలకతీతంగా పుర ప్రముఖులు మాజీ ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు, వ్యాపారస్థులు ఉద్యోగులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ మేరకు నర్సాపూర్ పట్టణంలో దసరా(విజయదశమి) వేడుకలను ఉల్లాసంగా ఉత్సాహంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా వుండగా నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో సైతం దసరా (విజయదశమి) పండగను ఆయా గ్రామాల ప్రజలంతా ఘనంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

## మండలంలో ఘనంగా దసరా వేడుకలు



న్యాల్‌కల్‌లో దసరా వేడుకల్లో షిలంగంలో పాల్గొన్న గ్రామస్థులు

**న్యాల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దసరా పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి కానవచ్చింది. దసరా పండగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో సాయంత్రం గ్రామశివారులో ఏర్పాటు చేసిన జమ్మి మొక్కలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి బంగారు ఆకులు తీసుకుని బంధువులు, మిత్రులకు అందిస్తూ, పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో దసరా పండగను బుధవారం జరుపుకున్నారు. గ్రామంలో గురువారం వచ్చేపండగను జరుపుకోకుండా ఒకరోజు ముందు జరుపుకోవడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది.

## మండలంలో ఘనంగా దసరా మహోత్సవాలు



జమ్మి మొక్కలకు పూజలు చేస్తున్న కరణ్ గజేంద్రభారతి మహారాజ్

**సిర్గాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దసరా పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం గ్రామస్థులు నూతన వస్త్రాలు ధరించి సాయంత్రం సంప్రదాయబద్ధంగా గ్రామ శివారులోని శమీ(జమ్మి) మొక్కలకు పూజలు నిర్వహించి శమీ ఆకులను ఒకరికొకరు అందించుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పరిధిలోని అంతర్గాంలో గజేంద్ర పీఠాధిపతి కరణ్ మహారాజ్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

## పుల్‌కల్‌లో దసరా మహోత్సవాలు

**పుల్‌కల్/చౌటకూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం దసరా పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకుని ప్రజలు గ్రామాల శివారులో ఏర్పాటు చేసిన జమి మొక్కలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి జమ్మి ఆకులను ఒకరికి ఒకరు పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగను పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారంలేకుండా ఎస్ఐ విశ్వజన్ పోలీసు సిబ్బందితో గస్తీ నిర్వహించారు.

## మాజీ మంత్రిని కలిసిన మఠం భిక్షపతి



మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన మఠం భిక్షపతి

**పుల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు మఠం భిక్షపతి శుక్రవారం మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును హైద్రాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి పండగ శుభాక్షాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటీసి సభ్యులు ఖాదిరాబాద్ రమేష్, కప్పాటి శ్రీనివాస్, నగేష్‌గౌడ్, అర్షద్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా దసరా వేడుకలు-జమ్మి మొక్కలకు పూజలు



రావణాసురుడి దిష్టిబొమ్మను దగ్ధంచేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దసరాపండగను రామచంద్రాపురం మండలంలోని ఆయా డివిజన్‌లలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకుని ఐదు గుళ్ల పోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాలవిహార్ పార్క్‌లో ఏర్పాటు చేసిన జమ్మి మొక్కలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి జమ్మి(బంగారం) ఆకులను తీసుకుని ఒకరికొకరు పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దసరాపండగను పురస్కరించుకుని ప్రజలు సామూహికంగా బాజాభజంత్రీలతో పట్టణ శివారులో ఏర్పాటు చేసిన రావణ దిష్టిబొమ్మను దగ్ధంచేసి జైశ్రీరాం నినాదాలుచేస్తూ ప్రజలు పండగను పసందుగా జరుపుకున్నారు. కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు, రావణ దహనకాండ కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు.

## రైతు లేనిదే రాజ్యం లేదు

**-రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**

**గుమ్మడిదల, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలోని పటాన్‌చెరు నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి రైతుబాధ్యతతోపాటు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తన స్వస్థలమైన కొత్తపల్లి గ్రామంలోని తన వ్యవసాయక్షేత్రంలో టమాట పంటపొలంలో పురుగులు వ్యాపించకుండా ముందస్తు చర్యగా రసాయన పిచికారి చేశారు. రైతు కుటుంబం నుంచి జన్మించిన ఆయన వంశపారంపర్యంగా తండ్రి నుంచి వచ్చిన పొలంలో తను వ్యవసాయంచేస్తూ ఇటు ప్రజలకు సేవచేస్తూ తనదైన శైలిలో ప్రజల మన్ననలను పొందుతున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నంపెట్టే రైతులే దేశానికి పట్టుకొమ్మలని అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి రైతుల సమస్యలు, అవసరాలను ప్రభుత్వానికి చేరవేస్తానని అన్నారు. పంటను సంపదగా భావించి కాపాడు కోవాలని, ముందుతరాలకు ఆహారభద్రతను అందించాలని స్పష్టంచేశారు.

# న్యామతాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**-ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు రామచందర్**

**న్యాల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని న్యామతాబాద్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయుధాల రామచందర్ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆయుధాల రామచందర్, అబ్రహం మాదిగలు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ గత 30 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటంచేసి విజయంసాధించిన మాదిగజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నిలిచిపోయారని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉల్లాస్‌మాదిగ, నిర్మల్‌కుమార్‌మాదిగ, శాంకుమార్, నర్సింహారెడ్డి, గొల్ల శామ్, వడ్ల మొగులయ్య, సుక్కు, రూబెన్, సాలోమోను, రత్నమ్మ, కనకమ్మ, సంగప్ప, సంజీవ్, గంగమ్మ, జాషువా, శ్రీను, యోహాను, యేసు, పాంరావ్ తదితరులు పాల్గొన్నారు.



న్యామతాబాద్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## దసరా వేడుకల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్



జహీరాబాద్ శివాలయంలో దసరా వేడుకల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీకైలాసగిరి శివాలయంలో ఏర్పాటుచేసిన జమ్మి ఆకుల పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు మాజీమంత్రి జమ్మి ఆకులను (బంగారం)ను పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, మాజీ ఎంపిటిసి సభ్యులు అశోక్, నాయకులు మంకాల్ సుభాష్, హుగ్గెల్లి రాములు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్షద్ అలీ, ఏయంసి డైరెక్టర్ శేఖర్, నాయకులు వంశీరాజ్, మోయిజ్, గౌస్, శాంసన్, జైరాజ్ ఆయూబ్ పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు పెంపు హర్షణీయం..

**-కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**గుమ్మడిదల, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిల జనాభా లెక్కల ప్రకారం 42శాతం రిజర్వేషన్లు పెంచడం పట్ల కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు లేకుండా చేశారని తాము అధికారంలోకి వస్తే బిసి కులగణనతోపాటు బిసి రిజర్వేషన్లు పెంచుతామని నాడు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్‌లో తెలిపారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే బిసి కులగణన చేయడంతో పాటు బిసిలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 42శాతానికి పెంచుతూ జీవో తీసుకురావడం బిసిల పట్ల కాంగ్రెస్‌పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధిని అర్థంచేసుకోవాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని అన్నారు.

## ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న శివకుమార్

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు కలుసుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు. డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు, సొసైటీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, మాజీ డైరెక్టర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ జడ్పిటిసి సభ్యులు, మాజీ ఎంపిపి అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు, తోటి నాయకులకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా నియోజకవర్గంలో దసరా వేడుకలు

**-జమ్మి ఆకులకు పూజలు చేసిన ఎమ్మెల్యే**



శివాలయం వద్ద జమ్మి మొక్కలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో గురువారం దసరా పండగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కైలాస గిరి శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జమి మొక్కలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు వేడుకల్లో పాల్గొని జమ్మి మొక్కలను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, శ్రీ కేతకి ఆలయ కమిటి మాజీ చైర్మన్ నీల వెంకటేశం తదితరులు పాల్గొని ప్రజలకు జమ్మి ఆకులు పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## అంబరాన్ని అంటిన దసరా సంబురాలు

**-రావణ దిష్టిబొమ్మల దహనం**



దసరా ఉత్సవాలలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని ఆయాగ్రామాల్లో, పట్టణాలలో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రజలు దసరా ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా పట్టణాలతోపాటు ఆయాగ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే, నాయకులు...**
దసరా ఉత్సవాల సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సిద్దిపేట పట్టణ మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్, రూరల్ పోలీసు స్టేషన్ హనుమాన్ దేవాలయం వద్ద అంజనేయస్వామి దేవాలయంలోలో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు రంగధాంపల్లిలో ఏర్పాటుచేసిన రావణాసురుడి దిష్టిబొమ్మల దహనకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా హరీష్‌రావు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట బిఆర్ఎస్‌నాయకులు కడవెర్గు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, ముత్యల కనకయ్య, మామిండ్ల ఐలయ్య, తిరుమల్ రెడ్డి, రంగధాంపల్లి శ్రీనివాస్, వివిధపార్టీల నేతలు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొని రావణుడి దిష్టిబొమ్మ దహనాన్ని అసక్తిగా తిలకించారు.

## పదేళ్ల పాలనలో ప్రజలకు బాకీపడింది బిఆర్ఎస్సే

**-నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్**

**చిన్నకోడూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు మీరే బాకీపడ్డారని అందుకే ప్రతిపక్ష హోదా ఇచ్చారని నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు అరకాల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రతిదీ రాజకీయం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుండా ఎగనామం పెట్టారని ఎవరికీ చెప్పుకోలేక మాజీ సర్పంచ్‌లు ఆస్తులు అమ్ముకొని అప్పులుకట్టుకొని, అప్పులు కట్టలేనివారు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితులు లేవన్నారు. సమావేశంలో సేవాదళ్ నాయకులు కోనేటీ కర్ణాకర్, జేరిపోతుల బాబు, గౌరబోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఖాజాపూర్‌లో తాగునీటి కష్టాలు

**-పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్థుల ఆగ్రహం**



ఖాజాపూర్‌లో వాటర్ ట్రాలీ వద్ద నీటి కోసం తంటాలుపడుతున్న ప్రజలు

**సిర్గాపూర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఖాజాపూర్‌లో ప్రజలు తాగు నీటి ఎద్దడిని ఎదురుకుంటున్నారు. గత వారం రోజులుగా (దసరానవరాత్రుల్లో) నీటికష్టాలు తీర్చాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోతే సమస్యను పరిష్కరించకుండా అసభ్య పదజాలంతో (పత్రికల్లో రాసే వీలేలేకుండా) దూషించాడని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీటిసరఫరా ఆగిపోవడంతో పాటు గ్రామంలోని గ్రామంలోని మంచినీటి పథకాల నుంచి సైతం తాగు నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు పడ్డపాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ప్రయివేటు బోరు నుంచి ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం మూలంగానే గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడి తొలగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్‌చేస్తున్నారు.

## తేన ఆటలపోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నైబర్‌హుడ్ అసోసియేషన్

**రామచంద్రాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
నైబర్‌హుడ్‌నెస్‌ను పెంపొందించేందుకు గత మూడు సంవత్సరాలుగా తెల్లాపూర్ పరిసరాల్లో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల మధ్య నిర్వహిస్తున్న 4వ ఆటలపోటీల వాల్‌పోస్టర్‌ను తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. మొదటిసంవత్సరం 400మంది, రెండవసంవత్సరం 800మంది, మూడోసంవత్సరం 1500మందికి పైగా క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నట్లు అసోసియేషన్ బాధ్యులు గుర్తుచేశారు. క్రీడాపోటీల్లో దాదాపుగా 80 గేటెడ్ కమ్యూనిటీల నుంచి క్రికెట్, వాలీబాల్, పికిల్‌బాల్, టెన్నిస్, బ్యాట్మెంటన్, చెస్, క్యారమ్స్, టేబుల్‌టెన్నిస్ తదితర పోటీలలో అన్ని వయసులవారు పాల్గొంటారన్నారు. రేసింగ్ ఎహెడ్ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన దేవీనవరాత్రి ఉత్సవాలు

**-భక్తిశ్రద్ధలతో అమ్మవారి శోభాయాత్ర**

**-వేలంపాటలో చీర, నోట్లకట్టలు**



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
మల్లికార్జున్‌నగర్‌లో దసరాపర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు (19వమారు) భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసాయి. అమ్మవారిని అందంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించుకుని ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన చీరను, నోట్లకట్టలకు వేలంపాట నిర్వహించారు. చీరను పవన్‌కుమార్ లక్షా ఇరవైవేల రూపాయలకు, ఈశ్వర్ నోట్లకట్టను రూ.70వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు.

## పట్టణంలో అలయ్‌బలయ్

**-పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి**



అలయ్‌బలయ్‌లో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, నాయకులు ఉజ్వల్‌రెడ్డిలు

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దసరాపండగను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో తెలంగాణరాష్ట్ర సెట్విన్‌చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ కాంగ్రెస్‌నాయకులతోకలిసి అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలయ్‌బలయ్‌లో పాల్గొన్న నాయకులు జమ్మి ఆకులను పంచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, సిడిసి చైర్మన్ ముబీన్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సత్వీర్‌సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కేతకి ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్‌పాటిల్, వైస్‌ఎంపిపి రాములు, నియోజవర్గ నాయకులు మల్లారెడ్డి, రాజశేఖర్, మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భీమయ్య, గుండారెడ్డి, జమీలాలోద్దీన్, సుబాష్‌రెడ్డి, అక్బర్, రాజు, నాగిరెడ్డి, అశ్విన్‌పాటిల్, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నతానెయల్ జగదీశ్వర్‌రెడ్డి, నరేష్, బబ్లూ, మల్లికార్జున్, నర్సింహాయాదవ్ పాల్గొన్నారు.

## అలయ్‌బలయ్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే





మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**నారాయణఖేడ్, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని భారతరాష్ట్రసమితి నియోజకవర్గ కార్యాలయంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డిపాల్గొని నియోజకవర్గంలోని బిఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు దసరాజమ్మినిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, పార్టీ సీనియర్‌నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## దసరా సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



దసరా వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులు

**పటాన్‌చెరు, అక్టోబరు 3, ప్రభాతవార్త:**
దసరా పండుగను పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి స్టేడియంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దసరాసంబురాల్లో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని, జిహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్వహించిన శమీపూజలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులతో కలిసి మైత్రిస్టేడియంలో నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.